# మరో శుభవార్త!

**చె**న్నై అడయారు బీచిలో తొందర తొందరగా అడుగులు వేస్తూ నాకంటె ముందు నడుస్తున్న ఒకరిని చేరుకొని ''క్షమించండి. మీకు ఇంగ్లీషు వచ్చా?'' అని అడిగాను, కొంచెం అయాస పడుతూనే.

''ఎందుకు?''

''నాకు తమిళం రాదు కనుక''

''అయితే, ఏమి మాట్లాడుతారు?''

''తెలుగు''

ఇంతవరకూ ఆంగ్లంలో సాగిన మా సంభాషణకు తెరదించుతూ, ''ఓ! మీరు తెలుగువారా? రండి, రండి. ఇక్కడ కూర్చుందాం'' అంటూ నన్ను తెలుగులో ఆహ్వానించేసరికి నాకు ఎంతోఆనందం కలిగింది. వారు కూర్చున్న చోటుకు పక్కనే కొంచెం ఎడంగా కూర్చున్నాను.

''నా పేరు నారాయణస్వామి. ప్రొఫెసర్ స్వామిగా నేను అందరికీ పరిచయం'' అన్నారు. నేనూ నా ఊరు, పేరు చెప్పాను. నేను చెన్నైకి ఎందుకు వచ్చిందీ చెప్పాను. ''నేను రెండు, మూడు వారాలు ఇక్కడ వుంటాను. ఈలోగా చెన్నై నగరాన్ని ఔపోసన పట్టాలని పార్కులు, బీచ్‌లు,మ్యూజియాలూ, దేవాలయాలు, రెస్టారెంటులు తిరుగుతున్నాను. అప్పుడప్పుడు కొందరితో మాటలు కలుపుతున్నాను. నా అదృష్టం కొద్దీ ఇప్పుడు మిమ్ములను కలిశాను'' అన్నాను, నవ్వుతూ.

''మీరు మాకు దగ్గరయ్యారు. నాదీ మీ ప్రాంతమే. నా భార్యదైతే మీలాగే విజయనగరమే. తన ఊరంటే తనకు అలవిమాలిన అభిమానం. మీరొకసారి మా ఇంటికిరండి. ఆ అభిమానమెంతటిదో మీరే స్వయంగా చూద్దురుగాని'' అన్నారు కొంచెం నవ్వుతూ.

''అలాగే'' అన్నాను.

''నేను ఇక్కడకు వచ్చి ఏభై ఏళ్ళయింది. ఇక్కడ ప్రొఫెసర్‌గా రిటైరై పదేళ్ళయింది. రిటైరయ్యాక మన ప్రాంతం వచ్చేద్దామని, మా ఊరికి దగ్గరలో ఉన్న చీపురు పల్లిలో ఒక ఇల్లు కొని దాని మార్పులకు చేర్పులకు చాలా ఖర్చుచేశాం. అయితే ఇతర కారణాలవలన ఇక్కడే ఉండిపోయాం'' అన్నారు.

నేను చెన్నైకి వచ్చిన పని గురించి వివరంగా చెప్పాను. వచ్చి వారం రోజులయిందనీ చెప్పాను. వారు కూడా చెన్నై ఎలా వచ్చిందీ, ఇక్కడ ఎలా స్థిరపడిందీ చెప్పారు. తరువాత ఇద్దరమూ లేచాం. వారు వారి కారు దగ్గరకు వెళ్తూ, నన్ను కూడా వారితో రమ్మన్నారు. నేను ఇక్కడ ఉంటున్నవారి మోటారు బైకుమీద వచ్చానన్నాను. వారు తన విజిటింగు కార్డు ఇచ్చి, తన ఇంటికి తేలికగా ఎలా రావచ్చునో చెప్పారు. మరునాడు సాయంత్రం 5 గంటలకు వస్తానన్నాను.

స్వామిగారు వయస్సులో పెద్దవారైనా తన వయస్సు కంటే చిన్నవారుగానూ, మంచి ఆరోగ్యవంతునిగానూ కనిపించారు. మనిషి మరీ అంత పొడగరి కాదు. అంత లావు కాదు. ఎర్రగా ఉంటారు. ముఖం దాదాపు నలు చదరంగా ఉంటుంది. వెడల్పాటి నుదురు. దానిపై ఎర్రని నిలువు బొట్టు పేంటులో దోపిన పొడవు చేతుల చారల షర్టు తలమీది వెంట్రుకలు పలుచబడినా మనిషి నిండుగా, హుందాగా కనిపించారు. వారితో పరిచయ మయినందులకు నాకెంతో సంతోషం కలిగింది.

మరునాడు సాయంత్రం అన్న సమయానికే వారింటికి వెళ్ళాను. ఇంటిని సులువుగానే పట్టుకోగలిగాను. డోరు బెల్లు కొట్టగానే స్వామిగారే తలుపు తీసి లోనికి ఆహ్వానించారు. మీరు వస్తారనే అనుకున్నాం... అంటూ భార్యను కేక వేశారు. గది అంత ఆధునికంగా లేదు. ఒక టేబులు నాలుగు కుర్చీలు ఉన్నాయి. టేబు

**కణుగుల వేంకటరావు**

లుకు ఒక వైపున ఉన్న ఒక్క కుర్చీలో వారు కూర్చుంటే, టేబులుకు రెండవ వైపున ఉన్న మూడు కుర్చీలలో ఒక దానిలో నేను కూర్చున్నాను. ఇంతలో గోడకు ఆనుకుని వంగి మెల్లగా నడుస్తూ వారి భార్య గదిలోకి వచ్చింది. మనిషి సన్నగా పొడవుగా ఉంది. బాగా తెలుపు. పాలి పోయినట్లుంది. స్వామివారికి ఈమెకు గల తేడా కొట్టవచ్చినట్లు కనబడింది.

"నిన్న బీచ్‌లో కలిశారని చెప్పానే వారే వీరు. రావు గారు" అంటూ నన్ను ఆమెకు పరిచయం చేశారు. ఆమె పేరు "వల్లి" అన్నారు.

"చాలా సంతోషం బాబూ! మా ఇంటికి వచ్చినందుకు. మీది విజయనగరమనీ, ఇంటికి వస్తారనీ చెప్పగానే ఎంతో ఆనందపడ్డాను. నిన్ను చూస్తే మా వాళ్ళను చూచినట్లుంది" అంటూ తానొక కుర్చీలాక్కొని అందులో పక్కగా కూర్చుంది. ఆ కూర్చోవడం ఆమెకు అంత సుఖంగా ఉన్నట్టు లేదు.

వాళ్ళ ఇల్లు విజయనగరంలో ఎక్కడ ఉండేదీ, తను ఏ హైస్కూలులో చదివిందీ, ఇంటరు ఏ సంవత్సరం చదివిందీ, డిగ్రీ ఎందుకు చదువలేదూ, చిన్ననాటి తన స్నేహితులెవరు, ఊరు ఎంతమంచిది, అక్కడివారి ఆప్యాయతలెటువంటివి, వస్తువులెంత చవుక మొదలగు విషయాలన్నీ, ఎంతో ఉత్సాహంగా నిన్న మొన్న జరిగినంత స్పష్టంగా పూసగుచ్చినట్లు చెప్పింది. ఇన్నేళ్ళుగా చెన్నైలో ఉన్నా ఆమె మాటల్లో ఒక్క తమిళపదంగాని, కనీసం తమిళయాసగాని లేదు. మెల్లగా కుర్చీదిగి, గోడనానుకొనే నడుస్తూ లోనికి వెళ్ళి నా కొరకు టీ, బిస్కట్లు తీసుకువచ్చింది. "ప్రొఫెసరు గారు ఈ సమయంలో ఏమీ తీసుకోరు" అంది. ఆమె మాట్లాడుతున్నంతసేపూ స్వామిగారు ఏమీ కల్పించుకో లేదు, ఏదో పుస్తకం చూస్తూ ఉండిపోయారు. ఆమె నాకు టీ తేవడానికి లోనికి వెళ్ళినపుడు మాత్రం నేను వచ్చిన పని ఎంతవరకు అయిందో తెలుసుకొని, అది తప్పక ఫలించాలనీ, ఆ కారణంగా నేను చెన్నై వచ్చినప్పుడంతా వారిని చూడడానికి రావాలనీ అన్నారు.

ఆమె వంగి నడుస్తూ టీ తెస్తుంటే నాకే కష్టమనిపించింది. చాలా ఏళ్ళక్రితం జరిగిన కారు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతినడంవలన అప్పటినుండి ఆమె పరిస్థితి ఇలా మారిందని తెలిసింది. నాకు చూపించడానికి, ఆ పుస్తకం తీసుకురా, ఈ పుస్తకం తీసుకురా అని స్వామి గారు ఆమెకే పురమాయిస్తుంటే, ఇంటి విషయా లలో ఆమెకు భర్తసాయం ఏ మాత్రం లేదనీ, పైపెచ్చు స్వామి

## చిన్ని గాయాలు

టెక్నాలజీ పెరిగింది
రంగు రంగుల రోజాలొచ్చాయ్
ఏం లాభం?
వాసన పోగొట్టుకున్నాయ్

భ్రమల్లో మునిగిపోయే వాడు
బ్రతుకులో ముందుకురాలేడు
శ్రమతో చెమటకార్చేవాడు
పరిశ్రమలు స్థాపించలేడు

'కర్మ'ను నమ్మిన 'కర్త'
ఎందుకూ పనికిరాడు
'క్రియ'ను నమ్ముకున్న 'కర్త'
ఏదైనా సాధిస్తాడు

పల్లె పడకేసింది
పట్టణం బావురుమంది
తిండిరాక
ఆకలిచావక

బ్రతుకును చంపడం
'చావు' పని
చస్తూ బ్రతకడం
'బ్రతుకు'పని

నాడు'మతం' చిచ్చు
మధ్యలో 'ప్రాంతం' చిచ్చు
నేడు 'భాష' చిచ్చు
అన్నీ మండుతూనే వున్నాయ్

ప్రక్కవారికి పంచేది
'బ్రతుకు'
ఒక్కడే అనుభవించేది
'చావు'

గుడ్డివానికి అద్దం
మంచి మనిషికి అందం
జడునికి అప్సరస
అవసరమా!

నువ్వూ నేనూ
వేరైనా
కలలవంతెన
ఇంకా కూలిపోలేదు

అయినాల కనకరత్నాచారి

# తెలుగు భాష

పండు వెన్నెల్ని చూసినప్పుడు
మల్లెల దరహాసాన్ని కాంచినప్పుడు
మల్లెల పరిమళాన్ని ఆస్వాదించినప్పుడు
మధుర ఫలరసాన్ని గ్రోలినప్పుడు
ఆంధ్రామాత గోంగూరను రుచి చూసినప్పుడు
తెలుగు వారి తొలి అతిథి ఆవకాయను తిన్నప్పుడు
పోతన భావతంలోని శారదాస్తుతిని విన్నప్పుడు
నండూరివారి ఎంకి స్ఫురణకొచ్చినప్పుడు
చిలకమర్తి వారి పార్వతీశాన్ని (బారిష్టర్)
పలకరిచించినప్పుడు
గిడుగువారి తెలుగు రచనల్ని అవలోకనం
చేసుకున్నప్పుడు
బాపూ బొమ్మల్ని గారవించినప్పుడు
చక్కని కుటుంబాన్ని చూసినప్పుడు
పల్లెల సౌరభాన్ని కాంచినప్పుడు
మాతృప్రేమ మధురిమను నేనాస్వాదించినప్పుడు
బంధుత్వానికీ ప్రేమకూ ఆదరణకూ
ఆప్యాయతకూ
నీతికీ న్యాయానికీ ధర్మానికీ త్యాగానికీ ధైర్యానికీ
కరుణకూ నా తెలుగు జాతి అద్దంపట్టినప్పుడు
ఏ దేశమేగినా ఎందుకాలిడినా అందందే
నా తెలుగు ప్రజల కీర్తి నడయాడుతున్నప్పుడు
నేనేమని కీర్తింతును తెలుగు జాతి గొప్పదనాన్ని!
నేనేలీల వచియింతునా తెలుగు భాష ఔన్నత్యాన్ని!
ప్రేమతత్వాన్ని!

*దోసపాటి సత్యనారాయణమూర్తి*

గారు తన అవసరాలకు కూడా ఆమెనే బాధ్యులను చేస్తున్నారనీ అర్థమయింది. సానుభూతికరువైన తన ఈ అవిటి బ్రతుకు ఆమెను 'ఎంతగానో బాధిస్తున్నదనీ, ఆ బాధను మరచిపోవడానికేనేమో, తన చిన్ననాటి జ్ఞాప కాలనే రక్షణ వలయంలోనికి జారుకుంటున్నాదని నాకు తోచింది. నేను వెళ్ళిపోవడానికి లేస్తే మళ్ళీ రమ్మని ఇద్దరూ కోరారు. మరల రెండు, మూడు రోజులలో వస్తా నని చెప్పి వెళ్ళాపోయాను.

ఈసారి నేను వెళ్ళేసరికి తలుపు తెరిచే వుంది. ఆమె గదిలో ఒక కుర్చీలో కూర్చొని ఏదో చదువుతూ ఉంది. నన్ను చూడగానే "రా! తమ్ముడూ! అంటూ లోనికి పిలిచింది. నేను కూర్చున్నాక తను లోనికి వెళ్ళి టీ, బిస్కట్లు పట్టుకు వచ్చింది. ప్రొఫెసరుగారు ఇప్పుడే వచ్చేస్తారు. బయటికి వెళ్ళారు అంది. అలానే కొద్ది సేపటికే వారు వచ్చి నన్ను పలకరించారు. మళ్ళీ మా ఇద్దరం సంభాషణలో పడ్డాం. సంభాషణ అంటే ఆమె చెప్పడం నేను వినడం. ఆమె చెప్పేవి ఎప్పటివలెనే తన చిన్ననాటి జ్ఞాపకాలయినా నూతనంగానూ, ఆసక్తికరం గాను ఉన్నాయి. ఆమె జ్ఞాపకశక్తికి నాకు ఆశ్చర్యం వేసింది. ఆరోజు వారివద్ద సెలవు తీసుకొని వెళ్ళేముందు చీపురు పల్లిలోని వారి ఇంటి ప్రస్తావన వచ్చింది. ఆ ఇంట్లో ఆమె మరిదిగారే ఒక భాగంలో ఉంటూ, మిగిలిన రెండు భాగాలూ అద్దెకు ఇచ్చారనీ, తన మరిది కూడా అద్దె చెల్లిస్తున్నాడనీ, అతడు చాలా మంచివాడనీ అద్దెలు వసూలు చేయడం, ఆ డబ్బును బ్యాంకులోని తమ ఖాతాలో జమచేయడం అంతా వారే చేస్తున్నారనీ చెప్పింది.

మరల రెండు, మూడు సార్లు వారింటికి వెళ్ళాను. వెళ్ళినప్పుడంతా విజయనగరం మనుషుల మంచితనం గురించీ, తన చిన్ననాటి స్నేహితుల గురించీ, చీపురుపల్లిలోని వారి ఇంటి గురించీ, తన మరిది మంచితనం గురించీ చెప్పున్నప్పటికీ అతనిపట్ల తనకేదో అసంతృప్తి ఉందని నాకు తోచింది.

నేను తిరిగి విజయనగరం వెళ్ళిపోయే ముందు, వారి వద్ద సెలవు తీసుకోవడానికి వెళ్తే ఆమె కంటతడిపెట్టడం నన్ను కలవరపరచింది. క్రితంసారి వెళ్ళినప్పుడు ఎంతో ఇష్టంగా ఆమె నాకు చదివి వినిపించిన ఒక పుస్తకంలోని మాటలు గుర్తుకొచ్చాయి.

"విజయనగరం పేరుకు బస్తీయే కాని, కల్లాకపటం ఎరుగని పల్లెటూరి మనస్తత్వం కలది. అమాయక పల్లె ప్రజలలో కానవచ్చే కలుపుగోలుతనం, ఆప్యాయతలను,

## చిరునామా

కరువు కాటకాలు
అతివృష్టి అనావృష్టి
విత్తనాల కొరత
ఎరువుల కొరత
కూలీల కొరత
కరెంటు కష్టాలు
అడుగడుగునా అవాంతరాలు
చీడపీడలకు ఎదురొడ్డి
ఆరుగాలం కష్టించి
పండించిన పంట
దళారుల పాలు
అమ్మబోతే అడవి
కొనబోతే కొరివి
రైతు కంట్లో కన్నీరు
చేసిన అప్పులకు
వడ్డీకి వడ్డీ చక్రవడ్డీ
అప్పుల పద్మవ్యూహంలో రైతన్న
అడుగడుగునా దగా మోసం
మాయా జూదంలో సర్వంకోల్పోయిన
ధర్మరాజులా నేటి రైతన్న
కంపెనీలకు కోట్ల సబ్సిడీలు
రైతుకు పదోపరక మద్దతు ధర పెంపు
కొడుకుకు చదువు కొనలేడు
పెళ్ళీడు పిల్ల పెండ్లి చేయలేడు
అర్ధాంగికి అడిగిన చీరకొనివ్వలేడు
రోగిష్టితండ్రికి వైద్యం చేయించలేడు
తాతలనాటి చవిటిమిద్దెలు
కుక్కి మంచాలు, చిరిగిన బొంతలు
చెదరిన బతుకులు
ఇది నేటి రైతు చిరునామా?
నీతికి నిజాయితీకి మారుపేరు రైతన్న
అబద్ధమాడలేడు ఐపిపెట్టలేడు
నేలతల్లిని విడువలేడు
మట్టివాసన విడిచి బతుకలేడు

*మేరెడ్డి యాదగిరి రెడ్డి*

ఆ బస్తీలో ఇప్పటికి కూడా మనం చూడవచ్చు''

నేను కూడా బాధపడుతూనే వారివద్ద సెలవు తీసుకున్నాను. నేను విజయనగరం వెళ్ళేక కూడా మా పరిచయాలు కొనసాగాయి. అప్పుడప్పుడు ఫోనులో మాట్లాడుకునే వారం. ఆమే సాధారణంగా మాట్లాడేది. ఆమే ఒకసారి ఫోనుచేసి చీపురుపల్లి బ్యాంకులో వేస్తున్న తమ ఇంటి అద్దె డబ్బులో ఇరవైవేల రూపాయల తేడా వస్తున్నదనీ, అయితే ఈ విషయం తన మరిదితో ప్రస్తావించలేమనీ అంది.

నేనే విషయం కనుక్కుంటానని చెప్పి వారి బ్యాంకు ఎకౌంటు నెంబరు, ఇతర వివరాలు తీసుకొని చీపురుపల్లి వెళ్ళి బ్యాంకులో భోగట్టా చేస్తే ఆ ఇరవైవేలు స్వామిగారే తీసుకున్నట్లు తెలింది. అదే ఆమెకు చెప్పాను. ఆమె ఒకింతటి నమ్మలేదు.

ఆ తరువాత ఒకసారి ఆమె మాట్లాడుతూ, తన మరిదికి బాగా జబ్బు చేసిందనీ, విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో ఉన్నారనీ, మరొకసారి మాట్లాడుతూ తన మరిదిని విశాఖపట్నం నుండి తీసుకు వచ్చారనీ ప్రస్తుతము చీపురుపల్లికి దగ్గరలోనే ఉన్న గరివిడిలో తన కూతురు వద్ద ఉంటున్నారనీ చెప్పింది. మరికొద్ది రోజులు పోయాక ఇంకొకసారి ఆమె ఫోనుచేసి ''తమ్ముడూ! శుభవార్త! మేము త్వరలో చీపురుపల్లి వచ్చేస్తున్నాం'' అంది.

''చాలా సంతోషం'' అన్నాను. ''మరొక శుభవార్త, నా మరిది క్యాన్సరు వలన ఈ మధ్యనే చనిపోయాడు''

అది వినగానే నా మతిపోయింది. చాలా మంచివాడనీ, తనకెంతో అభిమానమనీ చెప్పిన మరిది మరణిస్తే ఆమెకు శుభవార్త? విజయనగరం వారికి ఆప్యాయతలెక్కువ. కల్లా,కపటం తెలియదు అనే ఆమె నోటే ఈ మాట రావడమా? చాలాసేపటికిగాని నాకు తట్టలేదు. ఆమె మరిది మరణానికి వీరు చీపురుపల్లి రావడానికి ఏదో సంబంధం ఉందని. ■